సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్‌గా దంతులూరి దిలీప్‌కుమార్



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న దంతులూరి దిలీప్‌కుమార్, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

సాక్షి, అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు (ఏపీఐడబ్ల్యూఏ) చైర్మన్‌గా దంతులూరి దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ యువరాజ్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దిలీప్‌కుమార్ తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఉన్నారు.

ఏవీఎన్‌లో అల్లూరి మనవడి సందడి



రామరాజును సత్కరించిన ఏవీఎన్ యాజమాన్యం

డాబాగార్డెన్స్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సోదరుడి మనవడు అల్లూరి శ్రీరామరాజు ఏవీఎన్ కళాశాలలో సందడి చేశాడు. విద్యార్థులు, సిబ్బంది ఆయన్ని చూసి సంబరపడ్డారు. తన తాత చదువుకున్న ఏవీఎన్ స్కూల్‌ను సందర్శించడం గర్వంగా ఉందని రామరాజు చెప్పారు. ముందుగా కళాశాల ఆవరణలో గల అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అతడిని కళాశాల యాజమాన్యం సత్కరించింది.

నాడు-నేడులో అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయిదేవి

అనకాపల్లిటౌన్: నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఆధునికీకరిస్తుందని, వాటి పర్యవేక్షణపై ఆయా కేంద్రాల నిర్వాహకులు దృష్టిసారించాలని ఉమ్మడి విశాఖ ఆర్జేడీ చిన్మయిదేవి సూచించారు. గవరపాలెంలోని జిల్లా అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో సీడ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే, దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం మేలైన పోషకాహారం అందిస్తోందని, దాన్ని సక్రమంగా వినియోగించి, పిల్లల ఎదుగుదలకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పీడీ కె.అనంతలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మీనాలు మిలమిల



చేపలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

- ఫిష్ ఆంధ్ర పథకంతో యువతకు ఉపాధి.. భోజన ప్రియులకు తాజా చేపలు
- గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- భారీ సబ్సిడీతో పాటు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం
- ఏడాదికి పది వేల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి
- వాటిని విక్రయించేందుకు గంగపుత్రులకు మార్కెటింగ్ సౌకర్యం
- ఇంతవరకు జిల్లాలో 65 ఫిష్ ఆంధ్ర యూనిట్ల ప్రారంభం
- మరో 200 ఏర్పాటు చేసే దిశగా చర్యలు

అచ్యుతాపురం (అనకాపల్లి) /ఎస్.రాయవరం: 'మన చేప మన ఆరోగ్యం' అనే నినాదంతో ఉపాధి కల్పన, సుస్థిర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గత ఏడాది నవంబర్‌లో మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యకార అధికారులు ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామంలో జిల్లాలో మొదటిగా ఫిష్ ఆంధ్ర యూనిట్ ప్రారంభించారు. స్థానికులకు శ్రేష్ఠమైన పరిశుభ్ర వాతావరణంలో చేపలు లభించే ఏర్పాటు చేశారు.

విదేశాలకు పూడిమడక చేప

160 కిలోమీటర్ల తీర ప్రాంతం, 23 మత్స్యకార గ్రామాలున్న జిల్లాలో పూడిమడకకు ప్రత్యేక స్థానముంది. సరాసరిన రోజుకు అర టన్ను చేపలు ఉత్పత్తి అయ్యే పూడిమడక ప్రాంతం అత్యంత రక్షణ కలిగిన తీరం. అతి పెద్ద జాలరి గ్రామం. పూడిమడకలో లభించే గురకలు, పండు, చందువా, మేవ రకం చేపలు యూరప్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

జిల్లాలో అమూల్యమైన మత్స్య సంపద ఉన్నందున రాష్ట్ర స్థాయిలో ఫిష్ ఆంధ్రలో జిల్లాకు ఐదో స్థానం సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 65 యూనిట్లను ప్రారంభించారు. మరో 200 యూనిట్లు టార్గెట్‌గా పెట్టుకుని లక్ష్యం సాధించేందుకు జిల్లా మత్యశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. దీని ద్వారా మత్స్యకారులు, మత్స్యకార కుటుంబంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 3,500 మంది మత్స్యకారులు, 650 బోట్లతో జిల్లాలో మత్స్య సంపదను పట్టుకుంటున్నారు. 2,500 ఎకరాల్లో ఆక్వా కల్చర్, 7 రిజర్వాయర్లలో సైతం మత్స్య సంపద లభిస్తోంది. 126 చెరువుల్లోనూ అమూల్యమైన మత్స్య సంపద లభిస్తోంది. కేంద్ర సహకార బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్ర మినీలలో బతికి ఉన్న చేపల్ని, ఐస్‌తో ఉన్న చేపలను, చేప పచ్చళ్లను విక్రయిస్తున్నారు. మినీ షాపుల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాన్ని ప్రభుత్వం అందిస్తోంది. యూనిట్ విలువ రూ.3 లక్షల నుంచి 50 లక్షల వరకు ఉండేలా వివిధ రకాల మోడల్స్ రూపొందించారు. 10 శాతం లబ్ధిదారులు భరించాలి. ప్రభుత్వం 40 నుంచి 60 శాతం వరకు రాయితీ ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీలు, ఓసీ మహిళలకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. మిగతా మొత్తానికి బ్యాంకు రుణం ఏర్పాటు చేస్తారు.



కొరుప్రోలు ఫిష్ ఆంధ్ర యూనిట్

ఫిష్ ఆంధ్ర ప్రాధాన్యమిదీ..

ఫిష్ ఆంధ్ర అంటే చేపలు విక్రయించే దుకాణం.. ఏమిటి దీని ప్రత్యేకత అనిపించవచ్చు. కానీ ఈ కాన్సెప్ట్‌కు ఎంతో ప్రాధాన్యముంది. మత్స్యకారులకు చేపలు పట్టడం ఒక ఎత్తయితే.. వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవడం మరో ఎత్తు. అమ్ముకునే అవకాశాలు లేక గంగపుత్రులు ఒక్కోసారి తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం పొందలేకపోతున్నారు. మగవారు వేటకు వెళ్లి చేపలు తెస్తే.. మత్స్యకార మహిళలు వాటిని వీధుల్లో తిరిగి విక్రయించడం, లేదా మార్కెట్‌లో దుకాణం పెట్టుకొని అమ్ముకోవడం తెలిసిందే. కానీ ఫిష్ ఆంధ్ర యూనిట్ నెలకొల్పితే మత్స్యకారులకు మార్కెటింగ్ సమస్య ఉండదు. వారు పట్టిన చేపలను ఈ యూనిట్‌కు తెచ్చి విక్రయించవచ్చు. వాటికి పరిశుభ్రమైన పద్ధతుల్లో డ్రెస్సింగ్ చేసి, చక్కగా కోరిన సైజులో కట్ చేసి తాజా సరకును ఫిష్ ఆంధ్రలో వినియోగదారులకు అందిస్తారు. వీటి వల్ల అటు మత్స్యకారులకు, ఇటు వినియోగదారులకు మేలు కలుగుతుంది. ఈ యూనిట్‌లో భాగంగా ప్రభుత్వం కటింగ్ మిషన్, చేపలు తాజాగా ఉండేలా ఫ్రీజర్లు అందిస్తోంది. కేఎఫ్‌సీ తరహా ఫుడ్ కోర్టులు, మొబైల్ వ్యాన్లతో ఇంటి ముంగిటకే చేపలను అందించే ప్రతిపాదనలు కూడా ఫిష్ ఆంధ్ర పథకంలో ఉన్నాయి. ఇవి త్వరలో అందుబాటులోకి రానున్నాయి.



చేపలు భద్రపరిచే ఫ్రీజర్



నచ్చిన ఆకారంలో చేపను ముక్కలు చేస్తున్న కటింగ్ మిషన్

త్వరలో కేఎఫ్‌సీ తరహా ఫుడ్ కోర్టులు

రాష్ట్ర ప్రభుత్వ నూతన విధానంతో చేపట్టిన ఫిష్ ఆంధ్రకు ఆదరణ పెరుగుతోంది. చేప ఆహారం శ్రేష్ఠమనే ప్రచారంతో ఇప్పటికే జిల్లాలో 65 యూనిట్లు ప్రారంభించాము. మరో 40 యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కాక మరో 160 యూనిట్లు ప్రారంభించాలన్నది మా లక్ష్యం. రాష్ట్రంలో ఐదో స్థానం కోసం పోటీ పడుతున్నాం. చేపల విక్రయ అవుట్‌లెట్‌లతోపాటు.. చేప వంటకాలతో కేఎఫ్‌సీ తరహా ఫుడ్ కోర్టులను అచ్యుతాపురం, చోడవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాం.

–ప్రసాదరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, అనకాపల్లి జిల్లా

మంచి అవకాశం



చెరువుల్లో చేపలు పట్టుకుంటూ జీవనం సాగించే కుటుంబంలో పుట్టినప్పటికీ అనుకూల వాతావరణం లేక ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడిని. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా మా మత్స్యకారులకు మంచి అవకాశం కల్పించారు. చెరువులు, నదుల్లో పట్టిన చేపలు ఇక్కడే అమ్ముకునేలా ఏర్పాటు చేయడంతో నేను యూనిట్ పెట్టుకున్నాను. చేపల విక్రయానికి అవసరమైన సామగ్రిని సమకూర్చారు. చేపలు వేట చేసే వారి వద్ద నుంచి నేనే కొనుగోలు చేసి ఫిష్ ఆంధ్రలో భద్రపరచి విక్రయిస్తున్నాను. దాబాలు, రెస్టారెంట్ల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. మరింత స్టాక్ పెంచుకుని సరఫరాకు ఏర్పాట్లు చేసుకుంటున్నాను. ఆరోగ్యరీత్యా రానురాను చేపలకు డిమాండ్ పెరుగుతోంది. ఇలాంటి పథకాలు గంగపుత్రులకు ఎంతో మేలు చేస్తాయి.

–అంగా నారాయణరావు, కొరుప్రోలు ఫిష్ ఆంధ్ర నిర్వాహకుడు

స్థానిక ఉప ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- బాల్య వివాహాల కట్టడికి ప్రత్యేక చర్యలు
- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: జిల్లాలో పలు చోట్ల జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం నెల వారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 19న ఒక సర్పంచ్, 8 వార్డు సభ్యుల ఉప ఎన్నికలు జరగనున్నాయన్నారు. చట్ట ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం నేరమని, ఇలాంటి వాటిపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. బాల్య వివాహ బాధితులకు రక్షణ, సహాయాన్ని అందించాలన్నారు. పోలీసు అధికారులు బాలికల తల్లిదండ్రులకు మహిళా సంరక్షణ కార్యదర్శులతో కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సీఆర్‌పీసీ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్ కారణాలపై అధికారులను ఆరా తీశారు. త్వరితగతిన దర్యాప్తు చేసేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ట్రైన్‌లో గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి జిల్లా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులు స్పందించాలని సూచించారు.

ఆధార్‌కార్డుకు అనుసంధానమైన బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బు దోచుకోవడం, వివిధ ప్రభుత్వ పథకాల పట్ల ఆశ చూపి ప్రజలను మోసగించడం తదితర సైబర్ నేరాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభకనబర్చిన 32 మంది అధికారులు, సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలతోపాటు, నగదు పురస్కారంతో ఎస్పీ సత్కరించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ(క్రైం)పి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీలు కె.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, దిశ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణ్‌మూర్తి, పైడపునాయుడు, అప్పలనాయుడు, సతీష్, వెంకటరావు, ఎస్ఐలు, భీమరాజు, రఘువర్మ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రెండు మాసాల్లో డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం

- ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఏర్పాటుకు చర్యలు
- స్థలాల పరిశీలనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, కమిషనర్ సాయికాంత్‌వర్మ



ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లిటౌన్: స్థానిక జోనల్ కార్యాలయం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు సమస్యను రెండు మాసాల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మలు తెలిపారు. నూతన జిల్లాల్లో ప్రధాన కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలాల పరిశీలనలో భాగంగా పట్టణంలోని గాంధీనగరం ఆర్‌అండ్‌బీ భవనాన్ని, జీవీఎంసీ ఉద్యోగుల క్వార్టర్స్ స్థలాన్ని, కొత్తూరు డంపింగ్‌యార్డు స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ కార్యాలయం మేడపైన మరో అంతస్తు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకూ రహదారి విస్తరణలో భాగంగా భవనాల తొలగింపు యుద్ధప్రాతిపదికన జరుగుతోందన్నారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి, రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తొలగించి ప్రభుత్వ కార్యాలయాలు, లైబ్రరీ నిర్మించేందుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. పట్టణ జనాభాకు అనుగుణంగా మరికొన్ని రోడ్లను విస్తరించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు సచివాలయం-1, జీవీఎంసీ కల్యాణ మండపం, జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ, ఇన్‌చార్జి జెడ్సీ కె.చక్రవర్తి, తహసీల్దార్ గంగాధరరావు, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దన్‌రావు, వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా 'మాడుగుల'



దేవరాపల్లి మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

- పురోగతిని ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు
- టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పండి
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడి సూటి ప్రశ్న

దేవరాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మాడుగుల నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోలేని వారికి, తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడే హక్కులేదన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లతోపాటు మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం రూ.కోట్ల వ్యయంతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, ప్రతి ఇంటికీ కుళాయినీరు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ తదితర శాశ్వత భవనాలను పక్కా నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, ఇది కాదా అభివృద్ధి? అని ప్రశ్నించారు. ఇటీవల సీఎం కార్యాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోడల్‌గా, పక్కా నాణ్యత ప్రమాణాలతో నిర్మించిన తమ భవనాలను ప్రశంసించడమే ఇందుకు నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వం వేసిన సీసీ రోడ్లు వర్షానికి కొట్టుకుపోయిన ఆనవాళ్లు ఇంకా అలానే ఉన్నాయని ఎద్దేవా చేశారు. గ్రామాలకు అవసరమైన మౌలిక సౌకర్యాలను, కల్యాణ మండపాలు, సామాజిక భవనాల నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్నట్లు తెలిపారు. ఇదే మండల సర్వ సభ్య సమావేశంలో గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా, జెడ్పీటీసీగా, ప్రస్తుతం రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అందిస్తున్న పథకాలు, సేవలను వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



హిల్ స్టేషన్ కారవాన్ రానున్న డల్లాపల్లి ప్రాంతం

- రాష్ట్రవ్యాప్తంగా 15 ప్రాంతాల్లో కారవాన్ టూరిజంకు ప్రణాళికలు
- ఒక్కో ప్రాంతంలో అర ఎకరం విస్తీర్ణంలో పాత్ అభివృద్ధి
- పిక్నిక్ సీజన్‌లో ప్రారంభించేందుకు పర్యాటక శాఖ సన్నాహాలు

ఇప్పటికే ప్రపంచ దేశాల్లో, మన దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కారవాన్ పర్యాటకాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, గండికోట తదితర 15 చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో విశాఖకు సంబంధించి 3 ప్రాంతాలను ఎంపిక చేశారు.

ఉమ్మడి విశాఖలో గుర్తించిన ప్రాంతాలివే..

- అల్లూరి జిల్లాలోని అంజోడా –ఫారెస్ట్ కారవాన్
- డల్లాపల్లి – హిల్‌స్టేషన్ కారవాన్
- ఎర్రమట్టి దిబ్బలు – బీచ్ కారవాన్



విహారయాత్రకు వెళ్లేటప్పుడు హోటల్‌లో రూమ్ కోసం ఎదురు చూడటం.. రెస్టారెంట్‌లో ఫుడ్‌హోమ్లీగా ఉంటుందో లేదో అనే సందేహంతో అడుగు వేయడం.. ప్రైవసీపై ఎన్నో అనుమానాలు.. ప్రతి పర్యాటకుడికీ ఇలాంటి అనుభవాలు ఎదురయ్యే ఉంటాయి. ఇప్పుడా ఆ సమస్య లేకుండా.. నచ్చిన చోటకు వెళ్లి.. మనకు నచ్చినట్లుగా ఉండొచ్చు. అదే కారవాన్ టూరిజం. కొత్తపుంతలు తొక్కుతున్న ఈ టూరిజం వైపు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 ప్రాంతాల్లో దీనిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మూడు రకాల కారవాన్ టూరిజంను పర్యాటకులకు పరిచయం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

–సాక్షి, విశాఖపట్నం

ఇవీ సౌకర్యాలు

కారవాన్‌లో లగ్జరీ హోమ్స్ మాదిరిగా లాంజ్ కమ్ బెడ్రూమ్, కిచెన్, రెస్ట్ రూమ్ ఉంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రిక్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టవ్, మినీ ఫ్రిడ్జ్, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీ, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్, సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ సైజుల్లో కారవాన్లను సిద్ధం చేస్తున్నారు.

కన్సల్టెన్సీ కసరత్తు

కారవాన్ టూరిజంను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించేందుకు కన్సల్టెన్సీ కసరత్తు చేస్తోంది. డిమాండ్ ఎలా ఉంటుందన్న అంశంపై నివేదిక సిద్ధమవుతోంది. కారవాన్ టూరిజంలో పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు టూరిజం శాఖతో ఇప్పటికే సంప్రదింపులు జరిపాయి. పైలట్ ప్రాజెక్టు కావడంతో లగ్జరీ కంపెనీల వాహనాలు కాకుండా.. సాధారణ వాహనాలను లగ్జరీగా డిజైన్ చేయనున్నారు.

మూడు భిన్నమైన కారవాన్‌లు

కారవాన్ టూరిజం సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి నివేదికలు సిద్ధం చేశారు. మూడు ప్రాంతాల్లో మూడు భిన్నమైన టూరిజం స్పాట్లు ఎంపిక చేశారు. పైన్ చెట్లు అధికంగా ఉన్న అనంతగిరికి 35 కి.మీ దూరంలోని అంజోడాలో ఫారెస్ట్ కారవాన్, డల్లాపల్లిలో హిల్‌స్టేషన్ కారవాన్, ఎర్రమట్టి దిబ్బలు ఎదురుగా బీచ్ కారవాన్‌ను పైలట్‌గా ప్రారంభించేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. పైన్ చెట్లు పెంచేందుకు రెవెన్యూ విభాగం.. అటవీ శాఖకు 26 ఎకరాలు ఇచ్చింది. ఇందులో రెండు ఎకరాలను తమకు బదలాయించాలని, ఇందులో కారవాన్ టూరిజం ఏర్పాటు చేస్తామని అటవీశాఖకు లేఖ రాశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అనుమతులు వచ్చే అవకాశం ఉన్నాయి. మిగిలిన రెండు ప్రాంతాలూ టూరిజం శాఖకు సంబంధించినవే.

పిక్నిక్ సీజన్ నాటికి అందుబాటులోకి..



వివిధ దేశాల్లో విజయవంతంగా నడుస్తున్న కారవాన్ టూరిజం.. మన దేశంలో కేరళలో సక్సెస్ అయ్యింది. తొలి విడతగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాలను గుర్తించాం. ఆ ప్రాంతాల్లో అనుమతులు రాగానే ముందుకు వెళ్తాం. ఒక్కో ప్రాంతంలో అర ఎకరం విస్తీర్ణంలో కారవాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్

క్లుప్తంగా

కోలాను కలిసిన బొడ్డేడ



కోలా గురువులను సన్మానిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మహారాణిపేట (విశాఖ): వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులకు గురువారం పలువురు అభినందనలు తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆయన్ను పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఇతర నాయకులు కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు. నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరిట టోకరా

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా తిన్న పట్టణానికి చెందిన వ్యక్తి పట్టణ సీఐకి గురువారం ఫిర్యాదు చేశాడు. సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ హౌసింగ్‌బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శామ్యూల్‌మోరిష్ స్థానిక వేల్పులవీధికి చెందిన జి.కుమార్‌కు రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2002 సంవత్సరం నుంచి నేటి వరకు రూ.7లక్షలు వసూలు చేశాడు. తీరా ఇప్పుడు ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితుడు జి.కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

బాల్య వివాహాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, గొండు సీతారాం

అనకాపల్లి టౌన్: బాల్య వివాహం నిలుపుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సంబంధిత శాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హెచ్చరించారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ 31 అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో బాలల హక్కుల కమిషన్ మెంబర్ గొండు సీతారాం అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ బాల్య వివాహం జరిగినట్లు తెలిసిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. స్త్రీశిశు, సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, డీఆర్‌డీఏకి చెందిన పీఆర్పీ, గ్రామ సచివాలయాల మహిళా సంరక్షక కార్యదర్శులు బాల్య వివాహాలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి ఎంఈవోల ద్వారా పాఠశాలల్లో బాలబాలికలకు అవగాహన కల్పించాలన్నారు.

గ్రామాభ్యుదయ శాఖ, స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో చర్చించాలన్నారు. గ్రామ, మండల, స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, లేబర్‌శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ బాల్య వివాహాలపై ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు తలవంచాల్సిన పనిలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసి వెళ్లాలన్నారు. కమిటీ వారు ఎక్కడైనా ఉదాసీనంగా వ్యవహరించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల నిలుపుదలపై మహిళా సంరక్షణ కార్యదర్శులు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, డీపీవో శిరీషారాణి, డీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ ఆఫీసర్ మంజులావాణి, స్త్రీ శిశు, సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డీఈవో ఎం.మహాలక్ష్మమ్మ, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: ఎస్పీ

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణతో ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం భేటీ అయ్యారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణలో పోలీసు యంత్రాంగం చేపడుతున్న చర్యలపై వీరు చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులతో జిల్లాలో ప్రణాళికా యుతంగా బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్, డీసీపీయూ ప్రతినిధులు ఆనంద్, సత్యనారాయణ, పి.శేఖర్ పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతిచెందిన ఇంట్లో వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ ధనుంజయ్



మృతిచెందిన వాణి(ఫైల్)



మంచంపై మెడపై గాయాలతో మృతిచెందిన వాణి

- వస్త్రంతో మెడ నులిమి చంపినట్లు ఆనవాళ్లు
- చౌడవాడలో ఘటన

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన దొడ్డి వాణి(30) ఇంట్లో మేడపై గురువారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా మృతిచెందింది. ఆమె భర్త నూకరాజు ప్రైవేటు కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం అతడు విధులకు వెళ్లడంతో రాత్రి ఇంట్లో కుమార్తె వాణికి తోడుగా నిద్రించేందుకు తల్లి వరలక్ష్మి వచ్చింది. ఈ క్రమంలో తెల్లవారు జామున మేడపై గదిలో పడుకున్న కుమార్తెను లేపేందుకు తల్లి వెళ్లి చూడగా, చలనం లేకుండా పడి ఉంది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కింద ఇంట్లో ఉంటున్న వాణి అత్త, మామలకు సమాచారాన్ని అందించింది. దీంతో వారు వచ్చి చూడగా వాణి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. ఆమె మెడపై వస్త్రంతో నులిమి చంపినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి వరలక్ష్మి కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ తాతారావు, ఎస్ఐ ఆర్.ధనుంజయ్ పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

ఉలిక్కి పడ్డ చౌడువాడ..

గురువారం తెల్లవారుజామున దొడ్డి వాణి హత్యకు గురైందన్న వార్త గ్రామంలో సంచలనం కలిగించింది. గవరపేటకు వెళ్లే మార్గంలో ఉంటున్న ప్రజల్లో తీవ్ర భయాందోళన వ్యక్తమైంది. ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భార్య మృతితో భర్త నూకరాజు, కుమారులు బోరున విలపించడంతో వారిని ఓదార్చడం ఎవ్వరితరమూ కాలేదు.

హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

- అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి సొంత నిధులు



కుమారపురంలో ఇంటి నిర్మాణాలు

మునగపాక: సాధారణంగా రాజకీయ నేతలు పదిమంది కనిపిస్తే చాలు హామీలు గుప్పించేస్తారు. తర్వాత హామీలను విస్మరించడం చూస్తుంటాం. అందుకు భిన్నం యలమంచిలి ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు తీరు. పేదలకు కష్టం వచ్చిందని తెలిస్తే చాలు సాయం అందించేందుకు నేనున్నానంటూ భరోసా ఇవ్వడం ఆయనకే చెల్లుతోంది. వివరాలు ఇలా. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం పట్ల దళిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుమారపురం గ్రామం దళితవాడలో ఆయన దృష్టికి దళితులు ఇంటి నిర్మాణాల కోసం పడుతున్న ఇబ్బందులను స్థానిక నేతలు దేశంశెట్టి శంకరరావు, తాకాసి వెంకటరమణ తీసుకువచ్చారు. ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇంటి నిర్మాణాలు (శ్లాబ్ వేసుకునే పరిస్థితులు లేక) పూర్తి చేయలేకపోయినట్లు గుర్తించిన ఆయన తన వంతు సాయంగా ఇసుక, సిమెంట్, పిక్క, స్టీలు వంటి సామగ్రిని సొంత నిధులతో సమకూర్చారు. దీంతో కాలనీకి చెందిన దిగుమూర్తుల నాగమణి, నూక రత్నం, తుమ్ము ధనలక్ష్మి, తుమ్ము నాగలక్ష్మి, అగ్గాల సన్యాసమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఈబీ స్టేషన్‌లో నిందితుడి భార్య విచారణ?

- బాలింతరాలినైనా కనికరం చూపలేదని బాధితురాలి ఆరోపణ
- ఆమెను తీసుకువెళ్లలేదని ఎస్ఈబీ సీఐ వివరణ

కశింకోట: నిందితుడిని పట్టుకోవడానికి వెళ్లిన ఎస్ఈబీ పోలీసులు.. అతను లేకపోవడంతో భార్యను తీసుకువెళ్లి విచారించినట్టు వచ్చిన వార్త చర్చనీయాంశమైంది. తాళ్లపాలెంలో చోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో పోలీసులు గురువారం మద్యం కేసు నిందితుని పట్టుకోవడానికి ప్రయత్నించారు. యానాం నుంచి మద్యం కొనుగోలు చేసి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న మండలానికి చెందిన నిందితుడు తప్పించుకొని తిరుగుతున్నాడు. ఆయన నివాసం ఉంటున్న తాళ్లపాలెం వెళ్లిన పోలీసులు ఆచూకీ లేకపోవడంతో అతని భార్యను పట్టుకొని ప్రశ్నించారని సమాచారం. తనకు తెలియదనడంతో ఫోన్ చేసి రప్పించి తమకు అప్పగించాలని ఆదేశించినట్లు నిందితుని భార్య, బాధితురాలు కర్రి వెంకటలక్ష్మి తెలిపారు. బాలింతరాలు అని చూడకుండా తాను చేయని నేరానికి తాళ్లపాలెంలో అంగన్వాడీ కేంద్రంలో సరుకులు తీసుకోవడానికి వచ్చిన తనను తీసుకెళ్లారని వాపోయింది. చివరకు స్థానిక సచివాలయంలో తనను విడిచి వెళ్లారని ఆమె తెలిపింది. ఈ విషయమై చోడవరం ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సీఐ జోగమ్మను వివరణ కోరగా.. యానాం నుంచి మద్యం తెచ్చి జిల్లాలో వ్యాపారులకు సరఫరా చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న నిందితుడ్ని పట్టుకోవడానికి తాళ్లపాలెం వెళ్లామని, నిందితుడు దొరకలేదని, ఎవరినీ తీసుకులేదని చెప్పారు.

అదృశ్యమైన మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

- చౌడువాడ జీడితోటలో మృతదేహం లభ్యం
- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు



చౌడువాడ జీడితోటలో శ్రీను మృతదేహం, (ఇన్‌సెట్)శ్రీను (ఫైల్)

కె.కోటపాడు: ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి విగతజీవిగా మారాడు. చౌడువాడ శివారు జీడితోటలో మేడిశెట్టి శ్రీను(38) మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... దేవరాపల్లి మండలం ములకలాపల్లికి చెందిన మేడిశెట్టి శ్రీనుకు కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన రోహిణితో వివాహమైంది. కొన్ని రోజులుగా చౌడువాడలోనే వీరు నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లుగా శ్రీనుకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 12న గ్రామంలో భార్య పని చేస్తున్న పందుల ఫారం వద్దకు వెళ్లి తనను ఎవరో కొట్టేందుకు వస్తున్నారని చెప్పి పారిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో వెతికారు. ఈ క్రమంలో చౌడువాడ శివారు జీడితోటలో తీవ్ర దుర్వాసన రావడంతో రైతులు అనుమానంతో వచ్చి చూడగా మృతదేహం కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న భార్య రోహిణి అక్కడకు వెళ్లి మృతదేహం శ్రీనుదిగా గుర్తించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు పోలీసులు అప్పగించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి మృతితో వారు విలపించడంతో స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేశారు.

జెడ్పీ సర్వ సభ్య సమావేశం 22కు వాయిదా

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీకి వాయిదా పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈనెల 19న సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఖాళీగా ఉన్న పంచాయతీ స్థానాలకు ఎన్నికల దృష్ట్యా ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈవో పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

నేడు, రేపు విద్యార్థులకు పాటల పోటీలు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలోని వివిధ శాఖల విద్యార్థులకు ఈ పోటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 19వ తేదీ ఉదయం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హంగేరి నుంచి ప్రముఖ పకావజ్ విద్వాంసుడు బలాజ్స్ విరాగ్ హాజరవుతారని చెప్పారు. ప్రముఖ అంతర్జాతీయ యోగా గురువు వబ్బలరెడ్డి దుర్గాప్రసాద్‌ను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మార్గదర్శిలో సీఐడీ సోదాలు

దొండపర్తి / అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. వీరితోపాటు రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, విజిలెన్స్ అధికారులు కూడా ఈ సోదాల్లో పాల్గొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రికార్డులు, చిట్‌దారుల వివరాలు, బ్యాలెన్స్ షీట్లు, పన్నుల చెల్లింపులు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. డిపాజిటర్ల సొమ్ము మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్ల సేకరణ వంటి విషయాలపై కార్యాలయాల ఉద్యోగులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే నగరంలోని ఒక బ్రాంచిలో ఈనాడు విలేకరి మార్గదర్శి ట్రైనీ ఉద్యోగి పేరుతో కార్యాలయంలోకి వెళ్లి తిష్టవేశాడు. సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తమ వారికి చేరవేశాడు. అనకాపల్లి, విశాఖలోని సీతంపేట మెయిన్ రోడ్, ఎన్ఏడీ కూడలిలోని బ్రాంచిలలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు.

- పీఎం పాలెం మెయిన్ రోడ్డులోని విజేత సూపర్ మార్కెట్ పక్కన ఉన్న మార్గదర్శి మధురవాడ బ్రాంచిలో డీఎస్పీ నాగేశ్వరి ఆధ్వర్యంలో సోదాలు చేశారు.

రాయితీపై వివిధ రకాల మొక్కల సరఫరా

- సోషల్ ఫారెస్టు జిల్లా అధికారి లక్ష్మణ్

నర్సీపట్నం: రాయితీపై వివిధ రకాల మొక్కలు సరఫరా చేస్తున్నామని సోషల్ ఫారెస్టు జిల్లా అధికారి జి.లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవసరమైన మొక్కలు నామమాత్రం రుసుం చెల్లించి తీసుకువెళ్లవచ్చన్నారు. జిల్లాలో నర్సీపట్నంలో కమర్షియల్ నర్సరీ ఏర్పాటు చేసి కడియం నుంచి మొక్కలు తీసుకువచ్చి విక్రయిస్తున్నామన్నారు. మహాగని, రెడ్‌శాండిల్, టేక్ మొక్కల పెంపకంపై రైతులు కమర్షియల్ దృక్పథంలో ఆసక్తి చూపడంతో నర్సరీలో అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో గ్రీనరీ పెంపునకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి గ్రీన్ మిలీనియం కార్యక్రమానికి సంకల్పించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పది లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతకుమించి 18 లక్షల మొక్కలు నాటామన్నారు. 48 నర్సరీల్లో 13 లక్షలు మొక్కలు సరఫరాకు సిద్ధం చేశామన్నారు. 6 లక్షల సరుగుడు మొక్కలను రైతులకు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఇంటి ముందు మొక్క నాటాలనే నినాదంతో పని చేస్తున్నామన్నారు. జిల్లా అటవీ విస్తరణ పెంపుదలకు విస్తృతంగా మొక్కలు నాటుతున్నామన్నారు.



మొక్కలను నాటిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

అనకాపల్లి టౌన్: సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని శంకరం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వారు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాయితీగా నిర్భయంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా కార్యదర్శి పెంటకోట జోగినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మళ్ల భాస్కరరావు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కోయిలాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమాజంలో మీడియా పాత్ర కీలకం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సమాజంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. చోడవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లిలో ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఏపీవో చంద్రకళ, ప్రెస్ క్లబ్ సభ్యులు సన్యాసిరావు, రామరాజు, అప్పారావు, గణేష్ పాల్గొన్నారు.

తెగుళ్ల బారిన చెరకు తోటలు

చోడవరం: చెరకు తోటల్లో తెగుళ్ల సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి సూచించారు. గోవాడ సుగర్స్ ఆధ్వర్యంలో గోవాడ పొలాల్లో చెరకు రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరకు శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, డాక్టర్ గౌరీకుమారి, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ చంద్రశేఖర్ బృందం పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ఫ్యాక్టరీ ఫీల్డు సిబ్బంది, వ్యవసాయాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం చెరకు తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జడలు అల్లేటప్పుడు తోటల్లో గెడలను దుబ్బుగా చేసి చుట్టాలని అప్పుడు ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని తోటలు నేలకొరిగి పోకుండా నిలబడి ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. డిప్యూటీ కేన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరక్టర్ వి.వి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి
- ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

అనకాపల్లిటౌన్: కళాశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని ప్రిన్సిపాళ్లను జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఈవోతో పాటు జిల్లాలో ఉన్న ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపైన పట్టు సాధించేలా బోధన ఉండాలన్నారు. తెలివైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, విద్యాప్రమాణాలు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించి, తదనుగుణంగా బోధన అంశాలను రూపొందించాలని అన్నారు. అన్ని గ్రూపులవారికి వార్షిక ప్రణాళిక తయారు చేసి మెరిట్ విద్యార్థులను ముందుగా గుర్తించాలని ఆదేశించారు. లెక్చరర్ల బోధనలతోపాటు డిజిటల్ బోధనలు కూడా అలవర్చాలన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పాఠ్యాంశాలను తయారు చేసి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి సుజాత, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆడుదాం... ఆంధ్రా...

ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 2వతేదీ నుంచి 8వతేదీ వరకు నిర్వహించే వివిధ ఆటలపోటీల్లో ఎక్కువ సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొనేటట్లు చూడాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఈ పోటీల్లో 5 అంశాలుంటాయని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ మొదలైన ఆటలు, యోగా, టెన్నికాయిట్ మారథాన్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో ఉండే సంప్రదాయ ఆటలను కూడా చేర్చవచ్చని చెప్పారు. ఈ పోటీలకు అవసరమైన ఆట స్థలాలు, సామాగ్రి రిఫ్రెష్మెంట్స్ మొదలైన వాటికి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ చీఫ్ కోచ్ ఎల్.వి.రమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాంబిక సన్నిధిలో జీవీఎంసీ సీసీపీ



అమ్మవారిని దర్శించుకుంటున్న జీవీఎంసీ సీసీపీ సునీత

అనకాపల్లిటౌన్: గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్(సీసీపీ)వి.సునీత గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, పట్టణ టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దన్‌రావు, జీవీఎంసీ జోన్ సర్వేయర్ కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



కశింకోటలో వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కుక్కలు వీధుల్లో పగలు, రాత్రి అనే తేడాలేకుండా సంచరిస్తూ ఆ మార్గంలో వెళ్లే వారిని కరవడం, వెంటపడటం చేసి భయాందోళనకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. చీకటి పడితే కుక్కలు వీధుల్లో నడిచి ఇళ్లకు చేరనీయకుండా అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరిని స్వల్పంగా కరవడంతో రాత్రుళ్లు బయటికి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీని దృష్ట్యా వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 147 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,260
రెండో రకం	4,040	4,040
మూడోరకం	4,000	4,030

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
పిజ్జా	:	సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వరుణుడిపైనే ఖరీఫ్ ఆశలు

- మండలంలో మందకొడిగా వరి నాట్లు
- వచ్చే నెల 15 వరకు నాట్లుకు అవకాశం



పొలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

కశింకోట: మండలంలో మందకొడిగా ఖరీఫ్ వరి నాట్లు పడుతున్నాయి. ఈ ఏడాది సరైన వర్షాలు లేక వరినాట్లు జోరందుకోలేదు. నీటి సదుపాయం ఉన్నచోట మాత్రం సుమారు 30 శాతం మేర నాట్లు వేశారు. వర్షాధార భూముల్లో నాట్లు వేసేందుకు రైతులు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. మండలంలో ఎక్కువగా వరి, చెరకు పండిస్తారు. వీటిలో వరి గత రెండేళ్ల నుంచి అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా వరి సాగు పట్లే ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే వాతావరణం అనుకూలించక రైతులు దిగులు చెందుతున్నారు.

మూడో వంతుకు దగ్గరగా నాట్లు

ఈ ఏడాది 892 హెక్టార్ల వరి సాధారణ విస్తీర్ణంగా అధికారులు నిర్ణయించారు. వర్షాధారంగానే మండలంలోని ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. గత నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు ఉత్సాహంగా వరి నారుపోశారు. అవి ఎదగడంతో ఈ నెల మొదటి వారం నుంచి నీటి సదుపాయం ఉన్న చోట నాట్లు వేయడం ప్రారంభించారు. కొందరు నీరు లేనప్పటికి బోరు అందుబాటులో ఉన్న వారి సాయంతో నీటిని పట్టించి, సమయం మించకముందే నాట్లు వేస్తున్నారు. తర్వాతైనా వర్షం కురవకపోతుందా? అన్న ఆశతో నారు ముదరకముందే నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు బుధవారానికి 257 హెక్టార్లలో నాట్లు వేశారు.

శారద ఆయకట్టులోనూ అరకొరే

బోర్లు, బావులున్న రైతులతోపాటు, శారదానది, సాగునీటి చెరువుల ఆయకట్టు రైతులు నాట్లు వేస్తున్నారు. కశింకోట, వెదురుపర్తి, చెరకాం, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, జి.భీమవరం, తాళ్లపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి, సోమవరం, ఏఎస్ పేట, గొబ్బూరు, అడ్డాం, ఆనందపురం తదితర గ్రామాల్లో నీటి సదుపాయం ఉన్న మేరకు నాట్లు వేస్తున్నారు. నూతలగుంటపాలెం, ఏనుగుతుని గ్రామాల్లో శారదానది నుంచి వచ్చే సాగు నీటి కాలువ ఆధారంగా ఎక్కువ శాతం నాట్లు జరిగినట్లు అధికారులు చెప్తున్నారు. అచ్చెర్ల, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ, మోసయ్యపేట తదితర గ్రామాల్లో ఇంకా నాట్లు ప్రారంభం కాలేదు.



కశింకోటలో బోరు నీటితో వేసిన వరి నాట్లు



బయ్యవరం వద్ద వర్షాలు కురవక నీరు చేరని పెద్ద చెరువు

వర్షం కోసం నిరీక్షణ

నీటి సదుపాయం లేని రైతాంగం వర్షాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. బయ్యవరం పెద్ద చెరువు కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు పడి చెరువు నిండితే తప్ప ఆయకట్టులో నాట్లు వేసే పరిస్థితి లేదు. ఈ నెలాఖరులోగా సీజన్ ముగియనుండటంతో నాట్లు వేయాలి. అయితే వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. గత రెండేళ్లు సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి నాట్లు వేశారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో గతంలో మాదిరి వరి విస్తీర్ణం పెరుగుతుందా? లేదా? అన్న సందేహాలు నెలకొన్నాయి. ఇకనైనా వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు పడొచ్చని రైతులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల వరకు నాట్లు

మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 892 హెక్టార్లు. ఇప్పటికి 257 హెక్టార్లలో నాట్లు వేశారు. వరి సాగు ఎక్కువగా వర్షాధారమే. సరైన వర్షాలు లేక వరినాట్లు వేయడం ఈ ఏడాది ఆలస్యమవుతోంది. నీటి సదుపాయం ఉన్నచోట ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. వర్షాలు పడితేనే వరి నాట్లు పూర్తి అవుతాయి. వరి నాట్లు ఆలస్యం అవడంతో సెప్టెంబర్ 15 వరకు నాట్లు వేసే అవకాశం ఉంది.

– స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

ఇన్‌చార్జి జెడ్సీగా చక్రవర్తి



ఇన్‌చార్జి జెడ్సీ చక్రవర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయం ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్(జెడ్సీ)గా కె.చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జెడ్సీ ఎస్.వెంకటరమణ తన కుమార్తె వివాహం నిమిత్తం వచ్చే నెల 5వ తేదీ వరకు సెలవు పెట్టారు. దీంతో చక్రవర్తికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా చక్రవర్తి విలేకరులతో మాట్లాడుతూ విశాఖ జీవీఎంసీ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తు, అనకాపల్లి జెడ్సీగా అదనపు బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. జోన్ పరిధిలో 5 వార్డుల కార్పొరేటర్ల సహకారంతో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. పట్టణంలో దోమల నిర్మూలనకు రెండు పెద్ద ఫాగింగ్ వాహనాలను తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో జోన్ 4, 8 కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. పలు విభాగాల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలు తెలిపారు.

చట్టాల అమలుకు ముఠా కార్మికుల నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

అనకాపల్లి రూరల్: కనీస వేతనం చెల్లింపు, రక్షణ చట్టాల పటిష్ట అమలు కోరుతూ అనకాపల్లి పట్టణానికి చెందిన ముఠా కార్మికులు గురువారం నిరసన తెలిపారు. గాంధీనగరం వీధిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమానికి అవసరమైన చట్టాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల్లో పనిచేస్తున్న ముఠా కార్మికులు వయసు మళ్లిన తర్వాత ఎలాంటి ఆసరా లేని కారణంగా ఎంతో దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరకు రవాణాలో కీలకమైన లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేపట్టే ప్రదేశాల్లో ముఠా కార్మికులకు కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి ముఠా కార్మికుల కోసం కేరళ తరహాలో ఇక్కడ కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. బస్తా బరువు 50 కేజీలకు మించకుండా ఉండేలా ఆదేశాలివ్వాలని ప్రభుత్వాలకు ముఠా కార్మికులు విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ముఠా వర్కర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, ముఠా కార్మిక నాయకులు బి.అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, సురేష్, యు.రాజు, కల్యాణం పాల్గొన్నారు.

శ్రావణ మాసంలో హరికథా గానం



హరికథా గానాన్ని ఆలపిస్తున్న భారతి

అనకాపల్లిటౌన్: శ్రావణమాసం నెలరోజులూ గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో హరికథాగానం నిర్వహించనున్నట్లు దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఏలూరు పంచమవేదం మహాభారతం హరికథ జ్ఞానయజ్ఞము కళాకారిణి ఎస్.భారతి ఆధ్వర్యంలో హరికథా గానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ మాసోత్సవంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 వరకు హరికథా గానం ఉంటుందన్నారు. తబలతో కె.ప్రసాద్, హార్మోనియంతో కె.నాగేశ్వరరావులు సహకరిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వానికి తెలపండి

అనకాపల్లి రూరల్: జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేసిన వరి నారు, నాట్లు ఎండిపోతున్నాయని, వర్షాలు కురవకపోవడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు మరో వారం రోజులు కొనసాగితే రైతులంతా తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేపట్టలేని పరిస్థితి ఉందన్నారు. బోర్ల ఆధారంగా పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి వ్యవసాయాధికారులు రైతుల వద్దకు వెళ్లి తగు సూచనలు, సలహాలు అందించాలని విన్నవించారు. ప్రస్తుత పంటకాలం నష్టపోకుండా ప్రభుత్వమే విత్తనాలు ఉచితంగా అందించాలని కోరారు.

కొండ దిగిన టమాటా

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత నాలుగు వారాలుగా క్రమేపీ తగ్గుతూ వస్తోంది. కిలో రూ.200 గరిష్ట ధరకు చేరిన టమాటా, వారం వారం తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.50కి విక్రయాలు సాగాయి. ఏ గ్రేడ్ టమాటా రూ.70కి విక్రయించారు. బంగాళాదుంప రూ.25 నుంచి రూ.20కి తగ్గింది. ఉల్లిపాయ ఎప్పటిలాగే రూ.25, బెండకాయ, దొండకాయ, క్యాబేజి, బీన్స్, వంకాయ, బరబాటి రూ.40, బీట్‌రూట్, క్యారెట్, చేమదుంప, కాకర, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.100, అగాకర రూ.120కి విక్రయాలు సాగాయి.

బీసీ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక విజయ రెసిడెన్సీలో ఈ నెల 19న(శనివారం) ఉదయం 11 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాల జ్యోతిరావుపూలే బీసీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆడారి కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు నూతన కమిటీని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులంతా హాజరుకావాల్సిందిగా కోరారు.

శ్రావణమాస పూజలకు సన్నాహాలు



కనకమహాలక్ష్మి అమ్మవారు



కశింకోటలోని గవరపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

కశింకోట: స్థానిక గవరపేట వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం పూజలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా మార్గశిర మాసోత్సవాల్లో భారీ ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రావణ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారం పెద్ద ఎత్తున కుంకుమార్చనలు చేస్తారు. తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఉదయం అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

సంతోషిమాత ఆలయంలో శ్రావణమాస పూజలు



శ్రావణమాసం పూజల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయంలో నాలుగు శుక్రవారాలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన అమ్మవారి ఆలయం వద్ద పూజా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చెపడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, ఇందుకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 18న తొలి శుక్రవారం అమ్మవారికి విశేష కుంకుమ పూజలు, అభిషేకాలతో శ్రావణమాసం ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 25న రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, 31న రాఖీపౌర్ణమి, సెప్టెంబర్ 1న మూడో శుక్రవారం, 8న నాలుగో శుక్రవారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం ఆలయంలో సంతోషిమాత మహిళా సంఘం, శ్రీ సిద్ధి వినాయక సేవా సంఘం వారిచే భజనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో సంతోషిమాత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కె.ఎం.నాయుడు, విల్లూరి ప్రసాద్, దాడి ఈశ్వరరావు, పెతకంశెట్టి గోపి, చిల్లూరి పరమేశ్వరరావు, మల్ల రామకృష్ణ, మద్దాల భీమేష్, దాడి గోపి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేతలకు అభినందన



జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు పొందిన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

కశింకోట: అంతర్ యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రూపనంది గురువారం తెలిపారు. అనకాపల్లిలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న తమ స్కూల్ నుంచి 24 మంది విద్యార్థులు పతకాలు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు బంగారు, 11 మంది వెండి, 8 మంది కాంస్య పతకాలను పొందినట్లు తెలిపారు. విజేతలను ఆమెతోపాటు అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

మామిడిపాలెంలో 'గురుకులం' ఏర్పాటుకు వినతి



డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న మురళీకృష్ణ, చందు

అనకాపల్లిటౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మండలంలోని మామిడిపాలెంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విద్యార్థి విభాగం కన్వీనర్ కశిరెడ్డి మురళీకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో అనితకు గురువారం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మామిడిపాలెం గ్రామంలో సర్వే నెం.145లో 10 ఎకరాల్లో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం స్థలం మంజూరు చేసిందన్నారు. 5 ఎకరాల్లో నిరుపేదలకు జగనన్న గృహాలు మంజూరు చేశారని, మిగిలిన 5 ఎకరాల్లో గురుకుల పాఠశాల ఏర్పాటుకు తక్షణమే పనులు ప్రారంభించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మురళీ, లోకేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

అనకాపల్లిటౌన్: మండలంలోని పిసినికాడ గ్రామంలో 2019లో జరిగిన చోరీ కేసుల్లో ముద్దాయికి 42 రోజులు జైలు శిక్ష విధిస్తూ 13వ ఏఎంఎం న్యాయమూర్తి ఎం.శివకుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ నరసింగరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. 2019లో పిసినికాడ గ్రామంలో నిందితుడు పి.నవీన్ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కాడు. కేసు నమోదు చేసి న్యాయస్థానానికి అప్పగించారు. వాదోపవాదాలు అనంతరం నవీన్‌ను దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారని ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం



రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాంకీ ప్రతినిధులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ కార్యాలయానికి సమీపంలో కొలువుదీరిన శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ దంపతులు, రాంకీ సీఎఫ్‌వో ఎన్.ఎస్.రావు దంపతులు ఆలయ ప్రదక్షిణ, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, మూల మంత్రహోమం, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పం వంటి పూజలు నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో ఆలయంలో వాస్తు మండపారాధన, వాస్తు బలి, వాస్తు హోమం, మహాపూర్ణాహుతి, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, కుంకుమ పూజలు జరపనున్నారు. తొలి రోజు ద్వితీయ వార్షికోత్సవ పూజల్లో ఫార్మా పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.